రక్తపుటేర్లు

వసుంధర

(గత సంచిక తరువాయి)

"నాతో ఏం పని నీకు సురేష్!" అన్నాడు ప్రతాప్.

"చాలా ముఖ్యమైన పనిమీదే కబురు పెట్టాను...." అన్నాడు సురేష్ సాలోచనగా.

"ఏమిటది?"

"ఒక ప్రమాదకరమైన రహస్యాన్ని తెలుసుకున్నాను...."

ప్రతాప్ నవ్వాడు—"అది నాకు చెప్పొచ్చా?"

"మామూలుగా అయితే నీకు చెప్పివుండేవాణ్ని కాదు. కానీ ఇది జాహ్నవికి సంబంధించిన విషయం...."

ప్రతాప్ ఉలిక్కిపడి—"అంటే?" అన్నాడు.

"ఇటీవల చచ్చిపోయిన పెళ్ళికొడుకు సుబ్రహ్మణ్యం విజయబాబు మనిషి—తెలుసా?" అన్నాడు.

ఈ సమాచారాన్ని ప్రతాప్ పెద్దగా పట్టించుకోలేదు...."అయితే అవనీ—అందువల్ల మన కేమిబ్బంది?"

"విజయబాబుకు తెలుసు — జాహ్నవిని పెళ్ళాడదలచిన వాడు బ్రతకడని. అందుకే అన్ని ఏర్పాట్లూ పటిష్టంగా చేసి సుబ్రహ్మణ్యాన్ని పెళ్ళికి సిద్ధం చేశాడు. నిజానికి సుబ్రహ్మణ్యంగానీ, అతడి బంధువులుగానీ అసలైన పెళ్ళివారు కాదు. అందర్నీ అద్దెకు తెచ్చి ఓ చోట కలిపాడు...."

"అదన్నమాట సంగతి....ఎన్ని ఏర్పాట్లు చేస్తేనేం ఆ సుబ్రహ్మణ్యం కూడా బ్రతకలేదుగా."

"వాడో చవట దద్దమ్మ కాబట్టి బ్రతకలేదు...."

"అదేం కాదు....జాహ్నవిని ప్రేమించినవాడి ప్రేమ బలం అటువంటి...." అన్నాడు ప్రతాప్.

"ఆ ప్రేమబలం యెంతటిదైనా విజయబాబుని ఏమీ చెయ్యలేదు. ఆ విషయం ఒప్పుకుంటావా?"

"మధ్య విజయబాబు ప్రసక్తి ఎందుకు?"

"అసలు సంగతి తెలుసుకోవడం లేదు నువ్వు. జాహ్నవిని తన మనిషికిచ్చి వివాహం చేయాలనుకుంటున్నాడు విజయబాబు. ఇప్పుడది ఫెయిలయ్యేసరికి తనే ఆమెను వివాహం చేసుకుందుకు ముందుకొస్తున్నాడు...."

"వచ్చినా—వివాహం ఇప్పట్లో జరిగేది కాదు...."

"అలాగనుకోకు. జాహ్నవిని వీలైనంత వెంటనే చేపట్టడానికి విజయబాబు బ్రహ్మాండమైన పథకం ఒకటి వేస్తున్నాడు...."

ప్రతాప్ అసహనంగా చేతులతో నుదురు మీద రాసుకున్నాడు. ఆవేశాన్ని అదుపులోకి తెచ్చుకుందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసిపోతోంది — "నీ మాటలు తిన్నగా లేవు. విజయబాబుకు జాహ్నవిమీద ఆసక్తి ఎప్పట్నించి? అతడికామెపై ఆసక్తి వున్న పక్షంలో తనే పెళ్ళిచేసుకోక — మరొకడికెవరికో ఎందుకు పురమాయిస్తాడు?" అన్నాడు నెమ్మదిగా.

"ఎందుకంటే — విజయబాబు జాహ్నవి శరీరాన్ని వ్యాపారానికి ఉపయోగించాలనుకుంటున్నాడు—" అన్నాడు సురేష్.

"ఏమన్నావ్?" ప్రతాప్ ఆవేశాన్నదుపుచేసుకోలేక పోయాడు.

సురేష్, అతడికి విజయబాబు తన వద్దకు రావడమూ, జాహ్నవిని పెళ్ళిచేసుకోమని అడగడమూ గురించి చెప్పాడు.

ప్రతాప్ నుదుటిమీద చేతులతో బలంగా రాసుకున్నాడు. ఆవేశం అదుపులోకి రావడానికి కొంతసేపు పట్టింది.

"ఇప్పుడు విజయబాబు చేసిన పథకం గురించి వింటే ఇంకా దెబ్బతింటావ్!" అన్నాడు సురేష్.

"ఏమిటది?"

"సరిగ్గా రెండు రోజుల్లో విజయబాబుకూ, జాహ్నవికీ పెళ్ళవుతున్నట్లు ఊళ్లో పెద్దలకూ, రఘురాం బంధువులకూ శుభలేఖలు అందుతాయి. అది చూసి కలవరపడి విజయబాబు రఘురాం ఇంటికి వెడతాడు. ఇది తనకు తెలియకుండా జరిగిందని ఆయన దగ్గర వాపోతాడు. జాహ్నవిని వివాహమాడాలనుకున్నవాడి ప్రాణాలకు ప్రమాదమని తనకు తెలుసునంటాడు. కానీ వ్యవహారం ఇంతవరకూ వచ్చింది కాబట్టి — ఆ ఇంటి మార్యాద కాపాడ్డం కోసం — తను జాహ్నవిని పెళ్ళాడ్డానికి సిద్ధంగా వున్నా నంటాడు. రఘురాంగారు కాదనే స్థితిలో వుంటాడని నేననుకోను...."

ఈ పథకం విని ప్రతాప్ తెల్లబోయాడు.

"ఇది నీకు ఎలా తెలిసింది?" అన్నాడతను.

"ఎలాగో తెలిసింది! ప్రస్తుతం విజయబాబుకూ నాకూ కేవలం జాహ్నవి కారణంగా వ్యవహారం చెడిపోయింది. నేనే ఇప్పుడు ప్రమాదంలో వున్నాను...."

"అయితే ఇదంతా నాకెందుకు చెప్పావు?"

"జాహ్నవికి కాబోయే వరుడి అడ్డంకి తొలగిస్తావని!"

ప్రతాప్ ఆశ్చర్యంగా అతడివంక చూసి—"ఆ విష యంలో నువ్వే కదా—ఇంతకాలం నాకు సాయపడు తున్నావు...." అన్నాడు.

సురేష్ ప్రతాప్ వంక చురుగ్గా చూసి—"తల్లి పుట్టిల్లు గురించి మేనమామ దగ్గర చెప్పకు. జాహ్నవి పెళ్ళి కొడుకులెలా అంతమవుతున్నారో నీకు తెలుసు...." అన్నాడు.

"నువ్వు నటిస్తున్నావా? నిజం చెబుతున్నావా?" అన్నాడు ప్రతాప్ నమ్మలేనట్లు. అతడి కళ్ళలో ఏదో ఆశ్చర్యం కనబడుతోంది.

"ఇదే ప్రశ్న నేనూ నిన్ను అడగాలనుకుంటున్నాను" అన్నాను సురేష్.

ఇద్దరూ కాసేపు మౌనంగా వున్నారు.

జాహ్నవిని ప్రతాప్ ప్రేమిస్తున్న విషయం సురేష్‌కు తెలుసు. అతడామెను పెళ్ళిచేసుకోడనీ తెలుసు. సురేష్‌ని మాత్రమే జాహ్నవికి కాదగ్గ వరుడిగా అంగీకరించాడు ప్రతాప్. అయితే అందుకు కొన్ని షరతులున్నాయి. సురేష్ తన చెడు అలవాట్లన్నీ విడిచిపెట్టాలి. సురేష్‌కు జీవితం కొంత ఎంజాయ్ చేయాలని వుంది. రెండు సంవత్సరాలు అన్ని ఆనందాలూ చవిచూశాక అప్పుడు జాహ్నవిని పెళ్ళిచేసుకొని ప్రశాంతమైన జీవితం గడుపుతాడు. ఈలోగా జాహ్నవికి పెళ్ళి సంబంధం కుదరడానికి వీల్లేదు. కుదిరితే వరుణ్ణి మట్టుపెడతానని సురేష్ ప్రతాప్‌కు చెప్పాడు.

అయితే ప్రతాప్‌కు జాహ్నవిని వేరొకడు వివాహం

చేసుకోవడం ఇష్టముండదు. అసలు సురేష్ వివాహం చేసుకోవడం కూడా ఇష్టముండి వుండదు. సురేష్ కార్య రంగంలోకి దూకేవరకూ ఆగకుండానే అతనే వ్యవహారం పూర్తిచేస్తున్నాడు—ఇదీ సురేష్‌కు తెలిసిన విషయం.

"నేనలాగనుకోవడంలేదు. నువ్వు నిజంగానే రంగం లోకి వెంటనే దిగిపోతున్నావనుకుంటున్నాను—" అన్నాడు ప్రతాప్.

అతడి కళ్ళలో అమాయకత్వాన్ని చదవగలిగాడు సురేష్— "అయితే ఆ హత్య లెవరు చేశారంటావు?"

"నిన్ను గాక నేను నమ్మినదింకొకటుంది. బహుశా ఆ చావులకు కారణం అదేనేమో!" అన్నాడు ప్రతాప్.

"ఏమిటది?"

"బేతాళ పూజ...."

"బేతాళ పూజా?" ఏదో కొత్తమాట విన్నట్లు అన్నాడు సురేష్.

"అవును.... బేతాళ పూజ!" అన్నాడు ప్రతాప్.

"అంటే?"

ప్రతాప్ కళ్ళు తృప్తితో మెరుస్తున్నాయి—"ఇంత కాలం అంతా నీ కారణంగానే జరుగుతున్నదనుకున్నాను. ఏదో మానవాతీత శక్తి నాకు సాయపడుతున్నదన్న నమ్మకం ఇప్పుడే కలిగింది. బేతాళ పూజపై ఎలాంటి సందేహాలున్నా ఈ క్షణంలో తీరిపోయాయి. విజయబాబు కాదు....అతడి తలదన్నినవాళ్ళు వచ్చినా నాకెదురు లేదు. నా బేతాళ పూజ నన్ను రక్షిస్తుంది. అడ్డువచ్చిన వాళ్ళను భక్షిస్తుంది. నాలోని లోపాల్ని సవరిస్తుంది."

"ఏమిటా పూజ ప్రతాప్!" కుతూహలంగా అడిగాడు సురేష్.

"చెప్పను. చెప్పలేను! ఎట్టొచ్చీ-నీ వింక విజయబాబు గురించి ఏ విధమైన బెంగా పెట్టుకోకు...." అన్నాడు ప్రతాప్.

* * *

"సావిత్రీ—ఇంక మనం ఒకే ఒక్కసారి పూజచేయ బోతున్నాం. ఆ తర్వాతనుంచి నీ కష్టాలూ, నా కష్టాలూ పూర్తిగా తీరిపోతాయి..." అన్నాడు ప్రతాప్.

"అంటే?" అంది సావిత్రి.

"నా పూజా విధానంలో చాలాసార్లు నిన్ను బాధిం చానుకదూ!" అన్నాడు ప్రతాప్ జాలిగా.

"లేదు ప్రతాప్....నీ పూజ గురించి నాకు బాధలేదు. నాకు నువ్వు కావాలి...." అంది సావిత్రి.

"నిజంగా నీకు నేనంటే అంత ఇష్టమా?" అన్నాడు ప్రతాప్.

"ఊఁ."

"నాకోసం ఏమైనా చెయ్యగలవా?"

"ఊఁ."

"ప్రాణాలైనా ఇవ్వగలవా?"

"ఊఁ" అంది సావిత్రి ఏ మాత్రమూ తటపటా యించకుండా.

"ఊరికే అలాగంటున్నావు. ఇవ్వాల్సి వస్తే తటపటా యిస్తావు...."

సావిత్రి అదోలా నవ్వింది — "నన్ను మనిషిగా గుర్తించి, మనిషిలా కాంక్షించావు. నాలాంటి ఆడది కోరుకునేది నీలాంటి మగవాణ్ణి. నీలాంటివాడికోసం ప్రాణాలు ఇవ్వడమే కాదు ...ఎలాంటి నరకమైనా భరి స్తుంది...."

"ఈ మాటలు గుర్తుంచుకో సావిత్రీ! బహుశా నా కోసం నువ్వు ప్రాణాలు ఇవ్వాల్సి వుంటుందేమో— నరకాన్ని భరించాల్సి వుంటుందేమో!" అన్నాడు ప్రతాప్.

సావిత్రి అతడివంక చూసింది. అతడి ముఖంలో ఎలాంటి భావాలూ లేవు. ఏదో ఆలోచిస్తున్నాడని పిస్తుంది—"నీతో జీవితం తప్ప నాకింకే కోరికా లేదు. నీ సమక్షంలో వుంటే—అది నరకమైనా స్వర్గమే నాకు. నీ చేతుల్లో పోయే పక్షంలో ప్రాణాలు పోయినా సంతోషమే నాకు!"

"చాలా సంతోషం సావిత్రీ!" అన్నాడు ప్రతాప్—"ఇందాకనే చెప్పానుగదా — మనం కలిసి ఇంక ఒకే ఒక్క పూజ చేస్తాం. దాంతో అంతా అఖరు...." అని "సావిత్రీ! ఒకటినుంచి పది అంకెలు చెబుతాను.... వాటిలో నీ కిష్టమైనది కోరుకో...." అన్నాడతను.

అతడడిగింది సావిత్రికి వెంటనే అర్థంకాలేదు. అతడు వివరించాక—"నాకెంతో ప్రియమైన అంక నాలుగు!" అంది.

ప్రతాప్ ఆ తర్వాత నిర్మలను కలుసుకున్నాడు. ఒక రొక్కరుగా తనకు పరిచితమైన పదిమంది స్త్రీలనూ కలుసుకొన్నాడు. అందరూ సావిత్రికిలాగునే మాట్లాడారు.

తెలిసినా ఎంతోమంది ఆచరించలేని సృష్టిలోని మూల సూత్రమిది!

సౌందర్యం, మంచితనం అనబడేది మిథ్య.

ప్రపంచంలో తనకు నచ్చిన కొన్ని లక్షణాలను మనిషి అందంగానూ, మంచితనంగానూ నిర్వచించి—ఆ

నిర్వచనాలు సరైనవన్న భ్రమలో జీవిస్తున్నాడు. దశాబ్దాలుగా, శతాబ్దాలుగా, తరతరాలుగా ఆ భ్రమను కొనసాగిస్తున్నాడు.

అందంపట్ల ఆకర్షణనూ, అందవికారంపట్ల ద్వేషాన్ని సృష్టిస్తున్నాడు.

నిజానికి ఏది అందం? ఏది అందవికారం? ఏది మంచితనం? ఏది చెడ్డతనం?

అందం, మంచితనం అన్నవి వేర్వేరు పదాలు కావు. మనిషికి అందాన్నిచ్చేది మంచితనం. ప్రతి మనిషిలోని అందాన్ని గుర్తించడమే మంచితనం.

మనిషి మనిషినుంచి ఆశించేవి మనిషిగా గుర్తింపు! అన్ని విధాలా తనూ అందరితో సమానమని అంతా భావించాలన్న ఆశ!

ఈ విషయం గ్రహించక మనిషి మనిషిని డబ్బుతోటీ, అధికారంతోటీ, వంచనతోటీ గెలవాలని ప్రయత్నిస్తాడు. అదే సర్వానర్థాలకూ మూలమవుతోంది.

ప్రతాప్ చేరదీసిన యువతులందరూ సమాజంచేత ఏదో విధంగా వేటాడబడ్డవారే! అతడినుంచి లభించిన ఔదార్య వాక్యాలు, నిష్కల్మషమైన అభిమానం వారి నతడికి దాసోహం చేసింది. ప్రతాప్ వారినుంచి ఏదో ప్రయోజనమాశిస్తున్న మాట నిజం. అయితే అతడి ప్రేమలో చిత్తశుద్ధి వుంది. మనస్ఫూర్తిగా వారినతడు కాంక్షించడంవల్ల వారతనికోసం ఎటువంటి నరకాన్నయినా భరించేస్థితికి వచ్చారు.

ప్రతాప్ స్వార్థపరుడు. తనకోసం ఆ యువతులనతడు చేరదీశాడు. అందులో ఏమీ సందేహంలేదు. అయితే అతడెన్నుకున్న పద్ధతి కారణంగా—తనకోసం ప్రాణా

లర్పించే యువతులు తయారయ్యారు.

ఇదే పద్ధతిని — సాంఘిక సేవాతత్పరులు, స్వచ్ఛంద సేవాసంస్థలు, రాజకీయ నాయకులు, అధికారులు, తల్లి దండ్రులు—అనుసరిస్తే దేశంకోసం ప్రాణాలను తృణ ప్రాయం చేయగల ఆదర్శ పౌరులు తయారుకారా?

"నాకెవ్వరూ వద్దు. ఏమీ వద్దు. నువ్వు వద్దంటే ఈ ప్రాణాలతో కూడా నాకు పనిలేదు—" అని ప్రతి ఒక్కరూ ప్రతాప్‌తో అన్నారు.

"ఒకటినుంచి పదివరకూ అంకెలు చెబుతాను. నాలుగు మినహాయించి వాటిలో ఏదో ఒకటి కోరుకో—" అన్నాడు ప్రతాప్.

నిర్మల ఎనిమిది కోరుకుంది.

ఒక్కొక్కరే ఒకో అంకెను కోరుకున్నారు.

ప్రతాప్ ఒకొక్క అంకెనే ఓ కాగితంమీద వేసుకుని—పక్కన పేర్లు రాశాడు. అందరికంటే ముందు దమయంతి పేరుంది. ఆమె ఒకటిని కోరుకుంది. ప్రతాప్ ఆమెకు చెప్పాడు—"పంచమినాడు రాత్రి....మరిచిపోవు కదూ?"

"మరిచిపోను—" అన్నప్పుడు దమయంతి కనులలో తన్మయత్వం కనిపించింది.

* * *

అది పంచమినాడు రాత్రి....

పాడుబడిన శివాలయంలో ఇద్దరే ఇద్దరున్నారు.

అఘోరీబాబా....ప్రతాప్....

గుడికి కాస్త దూరంగా నేలమీద పదిగోతులు తవ్వ బడివున్నాయి. ఒకొక్కటీ నాలుగడుగుల వెడల్పు, ఏడడుగుల పొడవు, మూడడుగుల లోతు....వున్నాయి.

"ఇవన్నీ స్వయంగా చేసే తవ్వాను. తెలుసా?" అన్నాడు బాబా గర్వంగా. అతడి కళ్ళలో అదో రకమైన క్రూరత్వం మెరుస్తోంది.

ప్రతాప్ గోతులవంక చూడడంలేదు — "ఆమె వస్తుందంటావా, బాబా!" అన్నాడతను.

"వస్తుంది— బేతాళుడే ఆమెనిక్కడికి రప్పిస్తాడు. బేతాళుడి ఆజ్ఞను ఆమె కాదనలేదు—" అన్నాడు బాబా.

అప్పుడు చూశాడు ప్రతాప్.

గుడిలో శివుడు లేడు. బాబా ఏర్పరచిన బేతాళ విగ్రహం వుంది. విగ్రహం భయంకరంగా వుంది.

"ఆమె వస్తోంది!" అన్నాడు బాబా. అని పక్కకు తప్పుకున్నాడు.

ప్రతాప్ చూశాడు.

ఆమె వస్తోంది....వడివడిగా త్వరత్వరగా వస్తోంది. ఆమె నడకలో ఆత్రం వుంది. ప్రతాప్ ఆమెకు ఎదురు వెళ్ళాడు.

"నువ్వేనా?" అందామె సంతోషంగా.

ప్రతాప్ ఆమెను బలంగా కౌగలించుకున్నాడు. ఆమెకు ఎంతో సంతోషంగా వుంది.

"ఎలా వచ్చావ్?" అన్నాడతను.

"పుట్టింటికి పోతున్నానని ఆయనకు చెప్పాను. మొదటి ఆట సినిమాకు వెళ్ళాను. తర్వాత నువ్వు చూపిన సందులగొందుల దారిలో ఎవరికళ్ళా బడకుండా ఇక్కడకు వచ్చాను...."

ఇద్దరూ బేతాళ విగ్రహం ముందుకు వెళ్ళారు. విగ్రహాన్ని చూసి ఆమె అదిరిపడింది...."ఇంట్లో అయితే

చిన్న విగ్రహం.... కానీ ఇది చాలా పెద్దదిగా కనబడు తోంది...."

"అవును.... ఈ విగ్రహం పెద్దది. పూజ కూడా అందుకు తగ్గట్లుగానే వుంటుంది" - అన్నాడు ప్రతాప్.

దమయంతి భయపడింది — "అందుకు తగ్గట్లుగా అంటే?" అందామె. అప్పుడే ఆమె తన చుట్టూ వున్న వాతావరణాన్ని పరిశీలించింది. అంతసేపూ వున్న మైకం ఆమెనుంచి దిగిపోయింది. అదొక భయానక ప్రదేశం!

"భయపడకు. ఈసారి పూజకు కత్తులుండవు. నిమ్మ కాయలుండవు...."

దమయంతి తేలిగ్గా నిట్టూర్చి — "అన్నట్లు ఇదే ఆఖరు పూజ అన్నావు కదూ-" అంది. మళ్ళీ సంతోషం ఆమెకు కలిగింది.

"అవును—ఇదే ఆఖరు పూజ...." అని అతనంటూ అప్రయత్నంగా దూరంగా చూశాడు. బాబా స్వయంగా తవ్విన పది గోతులూ అతడికి కనబడ్డాయి.

"అయితే ప్రారంభించు...." అందామె.

ఆఖరి పూజకోసం ఆమె ఆత్రపడుతున్నట్లు గ్రహిం చాడతను.

"నాలో పూజావేశం కలగాలి. అందుకోసం నన్ను రెచ్చగొట్టేలా నృత్యంచేయి. నృత్యం పూర్తయేసరికి నీవంటిమీద దుస్తులుండకూడదు...."

అతడి వినోదమే ఆమె వినోదం. ఆమె నర్తకి కాదు. వేశ్య కాదు. ఒక సాధారణమైన ఆడది. అయితే ఆ క్షణంలో ఆమె అతడికోసం—నర్తకులను మించి నాట్య మాడుతోంది. వేశ్యకన్న మిన్నగా ఆడుతోంది.

అతడు కోరిన విధంగానే నాట్యం పూర్తయింది.

ప్రతాప్‌లో ఆవేశం రగిలింది. అతడామెను ఆవేశంగా సమీపించి—చేయి పట్టుకున్నాడు.

అతడి చేతిలో వేడి వుంది. ఆమె శరీరంలో వేడి వుంది. వాతావరణం చల్లగా వుంది ప్రేమికుల మనసుల్లో వేడి పుట్టిస్తోంది. భేతాళ విగ్రహం కళ్ళు చూసే క్రూరమైన చూపుల్లో వేడి ఉంది.

అంతా వేడిమయం!

"ప్రతాప్!" అందామె ఆనందంగా.

ప్రతాప్ పెదవులు అస్పష్టంగా కదిలాయి. అతడి మాటలు అతికష్టంమీద ఆమెకు అర్థమయ్యాయి.

"దమయంతీ!" అన్నాడతను. కొద్దిక్షణాలాగి—"ఇప్పుడు మనిషిని కాదు. పశువును...." అన్నాడు.

అతడి మాటలర్థమైనా ఆ మాటల కర్థం తెలియలేదు ఆమెకు. అయితే కొద్దిసేపటిలోనే అతడిచేతులామెకు ఆ మాటల అర్థాన్ని తెలియజెప్పాయి.

ప్రతాప్ ఆమెలో మనిషికాక పశువులా ప్రవర్తిస్తున్నాడు. అది అనుభవం కాదు....హింస....

ముందామె సహించింది. తర్వాత సహించడానికి ప్రయత్నించింది. ఆ తర్వాత సహించలేకపోయింది. ప్రతిఘటించడం ప్రారంభించింది. కొంతసేపటికి ప్రతిఘటించే శక్తి నశించింది. అతన్ని మాటలతో దూషించసాగింది. దూషిస్తున్నకొద్దీ అతడు రెచ్చిపోయాడు. ఆఖరికామెలో మాట్లాడే శక్తికూడా నశించిపోయింది. నిస్సహాయంగా అతడిని చూస్తోందామె. ఆ చూపులు అంటున్నాయి...."నువ్వు....మనిషివి కాదు....పశువ్వి."

కాసేపటికి ఆ చూపులకూ శక్తి తగ్గిపోయింది. ఆమె కనులు మూతపడ్డాయి. ఒక విధమైన పైశాచికావేశంలో

ప్రతాప్ ఆమెను అనుభవించి అక్కణ్నించి కదిలాడు. బాబా అతడి భుజంతట్టి — "అంతా చూశాను. పూజా విధానం సక్రమంగా ఉంది—" అన్నాడు.

ప్రతాప్ ఏదోలా బాబావంక చూశాడు.

"నిన్ను మెచ్చుకోవడం మరిచిపోయాను. శభాష్!" అన్నాడు బాబా మళ్ళీ.

"ఆమెకిప్పుడు ఏం జరుగుతుంది బాబా!"అన్నాడతను.

"నీ ఊహాకలాల్లోనే అలా అనుకో — నన్నేమీ అడక్కు. అది పూజా విధానానికే వ్యతిరేకం....ఇంక వెళ్ళు...." అన్నాడు బాబా.

"ఫలితం వుంటుందంటావా?" అన్నాడు ప్రతాప్.

"ఫలితాన్ని సందేహించకు. నీకు అంతా శుభమే జరుగుతుంది. వెళ్ళు...." అన్నాడు బాబా.

అప్పుడు ప్రతాప్ కదిలాడు.

"రేపు కూడా ఇదే విధంగా...." అన్నాడు బాబా.

ప్రతాప్ వెళ్ళిపోయాడు.

బాబా దమయంతిని సమీపించాడు.

బేతాళ విగ్రహానికి ముందు రక్తసిక్తమైన దేహంలో నగ్నంగా పడి వుందామె. బాబా వంగి ఆమె నాడి చూశాడు. అది బలహీనంగా కొట్టుకుంటోంది.

వున్నట్టుండి దమయంతి కళ్ళు తెరిచింది. ఎదురుగా బాబా కనిపించాడు. కెవ్వుమని అరవాలనుకుంది. కానీ ఓపిక లేదు.

ఆమెకంటికతను శవాలను పీక్కుతినే పిశాచంలా కనిపించాడు.

•   •   •

మర్నాడు తెలవగానే ప్రతాప్ జాహ్నవి ఇంటికి వెళ్ళాడు. అతడిని రఘురాం సాదరంగా ఆహ్వానించాడు.

"ఏదైనా పెళ్ళి శుభలేఖ వచ్చిందా?" అన్నాడు ప్రతాప్.

"ఎవరిది—నీదా?" అన్నాడు రఘురాం నవ్వుతూ.

"కాదు—జాహ్నవిది...." అన్నాడు ప్రతాప్ గంభీరంగా.

రఘురాం ముఖం అదోలాగై పోయింది — "దాని పెళ్ళికి శుభలేఖ వేయించే అవకాశం ఈ జన్మకుందో లేదో!"

"అదేం మామయ్యా—అలా దిగాలు పడిపోయావు."

రఘురాం మాట్లాడలేదు. కొన్ని ప్రశ్నలకు మౌనమే జవాబు.

తనకు తెలిసిన విషయం మామయ్యకు చెప్పాలా కూడదా అని ఆలోచిస్తున్నాడు ప్రతాప్. చెబితే ఎలా చెప్పాలి?

ఇద్దరూ ఆలోచిస్తూండగానే ఆ ఇంటిముందు స్కూటరొకటి ఆగింది. దానిమీంచి ఓ యువకుడు దిగాడు. అతడి చేతిలో పెద్ద కట్టవుంది. అందులోంచి ఒకటి తీసి పట్టుకుని అతడు రఘురాంని సమీపించాడు.

రఘురాం కార్డు అందుకున్నాడు.

అది జాహ్నవి పెళ్ళి శుభలేఖ. ఉలిక్కిపడి అంతా చదివి—"ఎవరయ్యా—ఈ విజయబాబు!" అన్నాడు రఘురాం కంగారుగా.

ప్రతాప్ నాలుగడుగులు ముందుకు వేసి-వెళ్ళిపోతున్న ఆ యువకుడి కాలరు పట్టుకుని — "ఎవరిచ్చారు—నీకీ కార్డులు...." అనడిగాడు.

"ప్రతాప్ గారండి...." అన్నాడా యువకుడు.

ప్రతాప్ ఉలిక్కిపడి—"ఏ ప్రతాప్?" అన్నాడు. అతడు చెప్పిన ఇంటి పేరు, వివరాలు తనకే సరిపోయాయి.

"నేనే ప్రతాప్‌ని-ఈ కార్డులు నేనే ఇచ్చానానీకు!"

"మీరు కాదండి...."

ఎవరో ప్రతాప్ పేరు చెప్పి ఆ కార్డులు ఇంటింటా పంచిపెట్టమన్నట్లు అర్థమయింది ప్రతాప్‌కి.

"ఈ కార్డులు ఇంకా ఎక్కడైనా ఇచ్చావా?"

"లేదండి—ఈ ఇంటినుంచే ఆరంభించమన్నారు...."

ప్రతాప్ ఆ కార్డులన్నీ లాక్కున్నాడు. ఆ యువకుణ్ణి పొమ్మన్నాడు. రఘురాం వంక తిరిగి—"ఈ విషయంలో నేను విన్నది నిజమేనన్నమాట....ఇంక ఆ విజయబాబు బ్రతకడు...." అన్నాడు.

విషయం పూర్తిగా అర్థంచేసుకోడానికి రఘురాంకు కొంతసేపు పట్టింది. అంతా విని ఆయన—"ఒక్కగా నొక్క కూతురు. పాపిష్టి వెధవల కళ్ళన్నీ దీనిమీదే పడుతున్నాయి...." అన్నాడు.

"అదృష్టవశాత్తూ ఈ కార్డుల తతంగంనుంచి బయట పడ్డాము. మనకూ మంచిరోజులు వస్తాయి మామయ్యా.." అన్నాడు ప్రతాప్.

"ఏం మంచిరోజులో!" అని రఘురాం నిట్టూర్చిన సమయంలో రామకృష్ణ ఇంట్లో ప్రవేశించాడు. అతను ప్రతాప్‌ని చూస్తూనే—"చిరకాల దర్శనం — నా మందారనూనె ఎలా పనిచేస్తోంది?" అనడిగాడు.

"మీరే చూసి చెప్పాలి—" అన్నాడు ప్రతాప్.

రఘురాం రామకృష్ణకు శుభలేఖ అందించి—జరిగింది చెప్పాడు.

"విజయబాబు ఈ ఏర్పాట్లెలా చేశాడు? అతణ్ని

నేనిప్పుడే లాకప్పులోంచి పలకరించి వస్తున్నాను....”
అన్నాడు రామకృష్ణ.

“విజయబాబు లాకప్పులోనా?” ఆశ్చర్యంగా అన్నాడు ప్రతాప్.

“అవును మరి—చేసిన పాపం పండింది....” అన్నాడు రామకృష్ణ.

“ఏమిటా పాపం?” అన్నాడు రఘురాం.

“విజయబాబు ఓ కొత్త పద్ధతిలో స్మగ్లింగ్ కొనసాగిస్తున్నాడు—” అన్నాడు రామకృష్ణ.

క్యాబరే డ్యాన్సరు మధురిమ స్మగ్లింగులో ఒక కీలక పాత్ర వహిస్తోంది. సరుకు ఎక్కడెక్కడ ఎవరెవ్వరికివ్వాలీ అన్న వివరాలన్నీ ఆమె దగ్గరే వుంటాయి. స్మగ్లర్స్ గ్యాంగులో వున్న వివిధ ప్రాంతాల మనుషులు, ఆఫీసులు వగైరా వివరాలన్నీ కోడ్ లాంగ్వేజిలో కొన్ని కాగితాలలో వ్రాసుకుని ఆమె వాటిని ఎన్నడూ తన ఉడుపులలో వుంచుకుంటుంది. వాటికి సంబంధించిన రికార్డు వేరే ఎక్కడా వుండదు.

ఆమెకు రక్షణగా భీమసేనుడు ఉంటాడు. నిజానికి భీమసేనుడు రక్షించేది ఆమె అందాన్ని కాదు.

ఆమె దాచిన కాగితాల్ని, ఆకాగితాలామె లోదుస్తుల్లో దాసుందని స్ఫురించడం కష్టం. ఆమె క్యాబరే నృత్యం ప్రారంభించగానే సరుకు కావలసిన వారందరూ ఆమెకు డబ్బు ఇస్తారు. ఆ నోట్లమీద, చెక్కులమీద కోడ్ లాంగ్వేజిలో తమ పేరు, చిరునామాలతో పాటు కావలసిన సరుకు వివరాలుంటాయి. బంగారం, వజ్రాలు, మత్తుపదార్థాలతో పాటు — అత్యంతాధునికమైన ఎలక్ట్రానిక్ పరికరాలు కూడా ఆ ముఠా స్మగుల్ చేస్తోంది.

మధురిమ తన గదికి వెళ్ళక తను సేకరించిన డబ్బు, చెక్కులతోపాటు—తను భద్రంగా దాచిన కాగితాలు కూడా విజయబాబుకివ్వాలి.

విజయబాబు ఈ ఊరికి గ్యాంగులీడరు వంటివాడు. అతడు అన్ని ఏర్పాట్లూ ఆ ప్రకారం చేసేస్తాడు. ఈ కార్యక్రమానికి మధురిమ ఒక పెద్ద ఆకర్షణ.

రామకృష్ణ ఈ స్మగ్లింగ్ గ్యాంగు అంతు చూడాలనే ఈ ఊరొచ్చాడు. ప్రభుత్వం అతడిని నియమించింది. మధురిమ వద్దనుంచి ఆ కాగితాలూ, డబ్బు కూడా అతను సంపాదించాడు. అయితే వాటిలోని భాషను డీకోడ్ చేయడం చాలా కష్టమయింది.

ఈలోగా కాగితాలు పోగొట్టుకున్న కారణంగా మధురిమను గ్యాంగు లీడరు చంపేశాడు. ఆ గ్యాంగు లీడరు విజయబాబు అని నిన్ననే తెలిసింది. మధురిమను అతడే హత్య చేసినట్లు ఆధారం దొరికింది. వెంటనే అతణ్ని లాకప్పులోకి తీసుకొనడం జరిగింది.

"ఉన్నట్లుండి హఠాత్తుగా ఏ ఆధారం దొరికింది?" అన్నాడు ప్రతాప్ ఆశ్చర్యంగా. ఇది బేతాళ పూజ మహాత్మ్యం కాదుగదా అని అతడికి మనసులో అనుమానంగా వుంది.

"ఈ ఊళ్ళో డేంజర్ అని ఒక కిరాయి గూండా వున్నాడు. అతడారోజు మధురిమను కలుసుకున్నట్లు తెలిసింది. ఆ రోజునుంచీ అతడికి తెలియకుండా అతడినో కంట కనిపెట్టడం ఆరంభమయింది. అతడు తరచు మధుసూదనరావు ఇంటికి వెడుతున్నాడు. నిన్న విజయబాబు, మధుసూదనరావు, డేంజర్ ఒకచోట కలుసుకుని మాట్లాడుతున్నది నేను విన్నాను...." (ఇంకా వుంది)